## క్లుప్తంగా

### ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గత నెల రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ సహస్రనామ పారాయణానికి కలశ ఉద్వాసనతో ముగింపు పలికారు. తొలుత భక్తులు 120 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం శ్రీలక్ష్మీ సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన కమిటీ సభ్యులు, భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన



పెనమలూరు: ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలో ఆశా డే సందర్భంగా మంగళవారం గైడ్ స్వచ్ఛంద సంస్థ వారు ఎయిడ్స్ నివారణకు 'మీకు తెలుసా' సదస్సును పెనమలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. ఎయిడ్స్ వచ్చి వారికి ఉచితంగా మందులు ఇస్తామని, 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కరపత్రాల ద్వారా ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిలలిత, సూపర్‌వైజర్ లక్ష్మి, నిర్మల కుమారి, గైడ్ ప్రాజెక్టు మేనేజర్ కె.సుజాత, సభ్యులు విజయ, సునీత, శిరీష, రజిని, నాగదుర్గ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కానూరు కామయ్యతోపునకు చెందిన దివి పిచ్చేశ్వరరావు ఆటోనగర్‌లో బడ్డీ కొట్టు నిర్వహిస్తాడు. కాగా గతనెల 22వ తేదీన పిచ్చేశ్వరరావు సోదరి వివాహం సందర్భంగా బైక్‌పై మచిలీపట్నంకు వెళ్లాడు. అదేరోజు రాత్రి బైక్‌పై మచిలీపట్నం నుంచి కామయ్యతోపు బయలుదేరాడు. గంగూరు వద్ద అతని బైక్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో పిచ్చేశ్వరరావు తలకు బలమైన గాయమయింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### పంట పొలాల పరిశీలన



గన్నవరం: మండలంలోని బుద్దవరం, బూతిమిల్లిపాడు, అజ్జంపూడి, కేసరపల్లి గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ ఎన్ఎల్. తేజస్వి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ముఖ్యంగా 1318 రకం వరి పైరు పిలకదశలో ఐదు రోజుల పాటు నీట మునిగినా ఎటువంటి నష్టం ఉండదని చెప్పారు. పొలాల్లో నీటిని తీసివేసిన తర్వాత ఎకరాకి 20 కేజీల యూరియా, మరో 20 కేజీల పొటాష్ అదనంగా చల్లాలని సూచించారు. ఈ బూస్టర్ డోసు వేయడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందని చెప్పారు. వరి పైరుకు కుళ్లు, తెగులు రాకుండా లీటరుకు ఒకటి నుంచి రెండు గ్రాముల కార్బన్డిజం, మాన్కోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారి చేయాలని సూచించారు. అనంతరం బుడమేరు కాలువ పరిధిలో ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

పెనమలూరు: భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను డీఆర్‌సీ టీమ్ మంగళవారం పరిశీలించింది. పీడీ నరసింహారావు, డీడీఏ జ్యోతిమణి, ఏడీఏ శ్రీనివాస్, శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, ఏఓలు పద్మజ, కనకమేడల శైలజ, టి.వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు పెనమలూరు, పోరంకి గ్రామాల్లో పంటలు పరిశీలించి వివరాలు నమోదు చేసుకొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పంట సాగులో సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### పేకాట శిబిరంపై దాడి

ఉంగుటూరు: పెద్ద అవుటపల్లిలో పేకాట శిబిరంపై ఆత్కూరు పోలీసులు సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అవుటపల్లిలోని కె.వెంకటేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డులో రహస్యంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 14మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2.25 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



వరద నీటిలో మునిగిన మంతెన జిల్లా పరిషత్ హైస్కూల్



గూడవల్లి, జక్కులనెక్కలం మధ్య పడవ సహాయంతో వరద బాధితులను రక్షిస్తున్న దృశ్యం



ఓగిరాలలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి



కురిపిరాల గ్రామంలో వరద నీరు

# కన్నీరు మిగిల్చిన వరద

- దిక్కుతోచని స్థితిలో బాధితులు
- దాతల సాయంతోనే భోజనాలు

పెనమలూరు: కృష్ణానది శాంతించింది. గత రెండు రోజులుగా బీభత్సం సృష్టించిన వరద తగ్గింది. ప్రజలు వరద షాక్ నుంచి తేరుకుంటున్నారు. అయితే అపార ఆస్థి నష్టం జరిగింది. ప్రజలు కోలుకోలేని దెబ్బతిన్నారు. కృష్ణానదికి దాదాపు 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో కరకట్టకు నీరు చేరుకుంది. దీంత వేలాది గృహాలు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. జనాలు అరచేతిలో ప్రాణాలతో సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ప్రాణ నష్టం జరగకపోయినా అపార ఆస్థి నష్టం జరిగింది. వరద బాధితులకు ప్రభుత్వ సాయం ఏమాత్రం అందలేదు. కేవలం దాతలు ముందుకు వచ్చి భోజన వసతులు ఏర్పాటు చేశారు. బాధితులు దిక్కుతోచని స్థితిలో నడి రోడ్డుపైనే ఉండి భోజనాలు చేశారు. చోడవరం, పెదపులిపాక గ్రామాల పరిధిలో వందల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి.

గన్నవరం: మండలంలోని పలు గ్రామాలు వరద ముంపు బారి నుంచి బయటపడుతున్నాయి. కేసరపల్లి-సావరగూడెం గ్రామాల మధ్య ఏలూరు కాలువకు గండి పడి గత రెండు రోజులుగా విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లు ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గడంతో నివాస గృహాలు ముంపు నుంచి బయటపడుతున్నాయి.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవలి గ్రామాలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. పలు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న బుడమేరు పొంగడంతో రామవరప్పాడు ఫ్లైఓవర్ కింది ప్రాంతాలు, కాల్వగట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గూడవల్లిలో బుడమేరుకు గండి పడటంతో పంట పొలాలతో పాటు గ్రామంలోకి వరదనీరు చేరుకుంది.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వాగు వరద ఉధృతికి బాపులపాడు మండలం కురిపిరాల గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. బుడమేరు వాగు గత మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహించడంతో ఇప్పటికే కురిపిరాల గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. బుడమేరుకు ఆనుకుని ఉన్న గ్రామం కావడంతో వరద తీవ్రత కారణంగా మంగళవారం ఇళ్లలోకి నీళ్లు చేరుకున్నాయి. పంట పొలాలు పూర్తిగా నీట మునిగి జలాశయాలను తలపిస్తున్నాయి. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం గ్రామాల్లో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం పర్యటించారు. ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడారు. వరద ముంపు నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ఉంగుటూరు: మండలంలో బుడమేరు, వన్నేరు వాగుల ఉధృతి మంగళవారం పెరిగింది. బుడమేరు పరివాహక గ్రామాలైన ఎలుకపాడు, వెల్దిపాడు, కొయ్యగూరపాడు, ఉంగుటూరు, లంకపల్లి, ఆముదాలపల్లి, వెంకట్రామపురం, గారపాడు, ఆనందపురం, పొణుకుమాడు, తుట్టగుంట గ్రామాల్లో వరద నీటితో పంట పొలాలు జలమయమయాయ్యి. వేంపాడు, కొయ్యగూరపాడు, తరిగొప్పల, ఆముదాలపల్లి గ్రామాల్లో నివాసాల్లోకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో అధికారులు పునరావాసం కల్పించారు.



జాతీయ రహదారి నుంచి నిడమానూరు గ్రామం వెలుపలికి వెళ్లే రోడ్డు పరిస్థితి



పెదపులిపాకలో వరద నీటిలోనే ఉన్న నివాసాలు



నిడమానూరు వంతెన కింద రైల్వే పట్టాలపై చేరిన వరదనీరు



నడి రోడ్డు పైనే భోజనాలు



తాగునీటి కోసం సావరగూడెం వస్తున్న ముస్తాబాద రైల్వే కాలనీ వాసులు



జలదిగ్బంధంలో వెల్దిపాడు గ్రామం

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది
- 8 వేల మంది పునరావాస కేంద్రాలకు తరలింపు
- అత్యవసర వేళ ప్రజల్ని తరలించేందుకు బోట్లు సిద్ధం
- జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ



మంతెన పునరావాస కేంద్రంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ

కంకిపాడు: బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. మండలంలోని బుడమేరు ముంపు ప్రాంతాలైన ఉప్పలూరు, మంతెన గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడి నిర్వాసితులతో మాట్లాడారు. బుడమేరు ఉధృతి, ముంపు ప్రభావంపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గీతాంజలి శర్మ మాట్లాడుతూ.. వరద, వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ముంపు సమస్య నెలకొందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు ఎనిమిది వేల మందిని ముంపు బారి నుంచి కాపాడి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. కృష్ణానదికి నీటి ఉధృతి స్వల్పంగా తగ్గిందన్నారు. బుడమేరు మాత్రం ఉధృతంగా ప్రవహిస్తోందని హెచ్చరించారు. పంట పొలాలు, ఇళ్లు ముంపు బారిన పడుతున్నాయని వివరించారు. నష్టాన్ని అధిగమించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ట్రాక్టర్లు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల్ని తరలించేందుకు పడవలను కూడా ఏర్పాటుచేశామని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుడమేరు ఉధృతి క్రమంలో స్థానికంగా ఉన్న యువత అందించిన సహాయ సహకారాలు అభినందనీయమని కొనియాడారు. జేసీ పర్యటనలో ఆర్డీఓ డి.రాజు, తహసీల్దార్ వి.భావన్నారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## తగ్గుతున్న కృష్ణమ్మ.. ఉధృతంగా బుడమేరు

- ఉప్పలూరు, తెన్నేరుకు పొంచి ఉన్న ముంపు భయం

కంకిపాడు: కృష్ణమ్మ ఉధృతి స్వల్పంగా తగ్గింది. మంగళవారం ఒక్కరోజే ఏటిపాయ సుమారు 8 అడుగులు మేర వెనక్కి వెళ్లింది. ఎగువ ప్రాంతాల నుంచి బ్యారేజీకి వచ్చే వరదనీరు తగ్గుముఖం పట్టడంతో ఏటిపాయలో ఉధృతి తగ్గుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధి గుండా కృష్ణానది ఏటిపాయ ప్రవహిస్తుంది. సోమవారం సాయంత్రం వరకూ కరకట్టకు కేవలం రెండు అడుగులు దిగువుగా వరదనీరు పొంగిపొర్లింది. రాత్రి నుంచి క్రమేపీ ఉధృతి తగ్గుతూ వచ్చింది. మంగళవారం సాయంత్రానికి ఎగువ నుంచి 7.40 లక్షలు క్యూసెక్కులకు చేరడంతో క్రమేపీ సాధారణ పరిస్థితి నెలకొనేందుకు మార్గం సుగమం అయ్యింది. కరకట్టకు దిగువున, ఏటిపాయలోని పుచ్చల లంక భూముల్లో సాగులో ఉన్న సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి, పసుపు, కంద, చెరకు, మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటలు వరదనీటిలో మునిగాయి. ఏటిపాయ తగ్గుముఖం పట్టడంతో సాగులో ఉన్న పంట పొలాలు నీటి ముంపు నుంచి బయటపడుతున్నాయి.

**పొంచి ఉన్న ముంపు**

కృష్ణమ్మ తగ్గుముఖం పట్టినా బుడమేరు ఉధృతి మాత్రం కొనసాగుతోంది. దీంతో ఉప్పలూరు, తెన్నేరు గ్రామాలకు ముంపు భయం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉప్పలూరు వద్ద కంకిపాడు-గన్నవరం రహదారి గుండా ప్రవహిస్తూ, వన్నేరు డ్రెయినులోకి వరదనీరు భారీగా చేరుతుంది. దీంతో ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలకు ఇప్పటికే నీరు చేరింది. ఉధృతి మరింతగా పెరిగి ప్రధాన గ్రామాల్లోకి వరదనీరు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పడవలు, ట్రాక్టర్లను సిద్ధం చేశారు. వరద సహాయక చర్యలను ఆర్డీఓ రాజు, తహసీల్దార్ భావన్నారాయణ పర్యవేక్షిస్తున్నారు.

## నిర్వాసితులకు ఆహారం పంపిణీ



భోజనం పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ విజయవాడ నార్త్ జోన్ రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు

కంకిపాడు: ఎస్‌బీఐ విజయవాడ నార్త్ జోన్ ఆధ్వర్యంలో తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఎస్‌బీఐ విజయవాడ నార్త్ జోన్ రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు నిర్వాసితులకు మంగళవారం అల్పాహారం, భోజనం అందించారు. నిర్వాసితులకు తమ వంతు బాధ్యతగా ఆహారం పంపిణీ చేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో కంకిపాడు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఏవీవీఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు.

గన్నవరం: వరద బాధితులను ఆదుకోవడంలో కృష్ణా మిల్క్ యూనియన్ తమవంతు సహకరం అందిస్తుందని ఆ సంస్థ జిల్లా డైరెక్టర్లు పాలడుగు వెంకటరామ వరప్రసాద్(నాని), పలగాని కొండలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బుడమేరు కాలువ ముంపునకు గురైన బాధితులకు తమ యూనియన్ ద్వారా పాలు, ఆహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెనమలూరు: వరద బాధితులకు సీపీఎం పార్టీ వలంటీర్‌ల సర్వీసు, రాయల్ క్లబ్ విజయవాడ సహకారంతో యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో మంగళవారం భోజన ప్యాకెట్లు, తాగు నీరు అందజేశారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. మండల సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రాణాలతో చెలగాటం



కామయ్యతోపు వద్ద బందరు రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న స్టాపర్లు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు మధ్యలో కామయ్యతోపు వద్ద పెద్ద గుంత పడటంతో ట్రాఫిక్ పోలీసులు స్టాపర్లు పెట్టారు. అయితే రాత్రి సమయంలో రోడ్డు మధ్యలో ఉన్న స్టాపర్లు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కామయ్యతోపు వద్ద గుంత శాశ్వతంగా మరమ్మతులు చేయడంలో నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గుంతలో పడి ప్రమాదాలకు గురవుతారని ట్రాఫిక్ పోలీసుల స్టాపర్లు పెడుతున్నారు. అయితే రాత్రి సమయంలో స్టాపర్లు కనిపించకపోవడంతో వాహనదారు ప్రదామాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీగా ఉండే బందరు రోడ్డును గుంతలు పడకుండా వెంటనే శాశ్వత మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు



యనమలకుదురులో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: వరద ప్రాంతంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. యనమలకుదురులో మంగళవారం ఆయన పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో వరద ప్రభావం చాలా ఉందన్నారు. దీంతో పలు కాలనీలు ముంపునకు గురై పరిసరాలు దారుణంగా ఉన్నాయని చెప్పారు. వరద ప్రాంతాల్లో చెత్త తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ చేస్తున్నామని తెలిపారు.

**గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు**

నున్న(విజయవాడరూరల్): వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. వర్షం నీరు నిల్వ ఉన్న ప్రధాన వీధుల్లో గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బంది బ్లీచింగ్ చల్లుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో టైఫాయిడ్, డెంగీ జ్వరాలు అధికంగా ఉంటున్న పరిస్థితితుల్లో వర్షాల కారణంగా వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ ఆదేశాల మేరకు మంగళవారం నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

### నష్ట పరిహారం మంజూరు చేయాలి

గన్నవరం రూరల్: వరద ముంపునకు గురైన రైతులకు ఎకరానికి రూ. 25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి డిమాండ్ చేశారు. మంగళవారం ముస్తాబాద గ్రామంలో ఆమె నీట మునిగిన పంట పొలాలు పరిశీలించి, స్థానిక కమ్యూనిటీ హాల్‌లో పునరావాసం పొందుతున్న వరద బాధితులను పరామర్శించారు. రైతాంగానికి నష్ట పరిహారం వెంటనే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రం పంపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. అన్నవరపు జయలక్ష్మి, ముస్తాబాద గ్రామస్తులు పాల్గొన్నారు.

### అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం 200 మంది భక్తులకు ముద్రగడ భాస్కరరావు, లక్ష్మి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### యోగా శిక్షకుడికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడిగా పని చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా వైద్యాధికారిణి డాక్టర్ కె. వాహిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగా కోర్సులో డిప్లమో లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు 99510 68160 ఫోన్ నంబర్‌ను లేదా పని వేళల్లో ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ. 250 చొప్పున పారితోషికం చెల్లించబడుతుందని పేర్కొన్నారు.

### వైద్య శిబిరాలు నిర్వహించాలి

కంకిపాడు: వరదలు, వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామ గ్రామానా వైద్య శిబిరాలు నిర్వహించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో వైద్య సేవలు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.